క్లుప్తంగా

ఆలయ హుండీ సొమ్ము లెక్కింపు



కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ మృత్యుంజయేశ్వర స్వామి ఆలయ హుండీ ఆదాయం సోమవారం లెక్కించారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రమణమ్మ ఆధ్వర్యంలో కడప గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈఓ ఎ.శ్రీధర్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిబ్రవరి 17 నుంచి సోమవారం వరకు హుండీల ద్వారా రూ. 61,431 లభించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు ఎన్.సతీష్ శశిధర్, ఎన్.దక్షిణామూర్తి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న సభ్యులతో అతిథులు

కడప కోటిరెడ్డి సర్కిల్ : ప్రతి ఆరు నెలలకొకసారి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని నెహ్రూ యువ కేంద్రం అధికారి మణికంఠ తెలిపారు. సోమవారం జేబీవీఎస్ ది ఫ్రిజర్వేర్ సేవా సమితి ఆధ్వర్యంలో కడప నగరంలోని బాలాజి నగర్ రోడ్డు నెంబర్ 13లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు అశోక్ మాట్లాడుతూ మణికంఠ జిల్లాలో యువజన అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు లక్ష్మీదేవి, విజయ్, ఈశ్వరయ్య, సంస్థ సభ్యులు కాశీ, ఆశిక్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

గాజుల అలంకారం



గాజుల అలంకారంలో నడివీధి గంగమ్మ తల్లి

కడప కల్చరల్ : కడప నగరం హనుమప్ప వీధిలోగల గ్రామ దేవత శ్రీ నడివీధి గంగమ్మ తలి క్షేత్రంలో జాతర ఉత్సవాల సందర్భంగా సోమవారం అమ్మవారిని లక్ష గాజులతో కనుల పండువగా అలంకరించారు. రంగురంగుల గాజులను సరాల కొద్ది పేరుస్తూ అమ్మవారిని మరింత అలంకార భూషితంగా తీర్చిదిద్దారు. జాతర ఉత్సవాల్లో భాగంగా మూడవరోజు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. గాజుల అలంకారంలోని అమ్మవారిని దర్శించుకునేందుకు స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. భక్తులందరికీ నిర్వాహకులు గోపాల్‌సింగ్ దంపతులు తీర్థ ప్రసాదాలను ప్రసాదంగా అందజేశారు.

కాలాష్టమి పూజలు

కడప కల్చరల్ : శ్రీ ఇష్టకామ్యార్థ కాలభైరవ స్వామి ఆలయంలో సోమవారం కాలాష్టమిని వైభవంగా నిర్వహించారు. స్వామికి పంచామృతాభిషేకం, అష్టోత్తరం, కుష్మాండ దీపసేవారాధన తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కోసం స్థానిక ద్వారకానగర్‌కు చెందిన శైలజా రామ్మోహనరెడ్డి రూ. 15,000 విరాళాన్ని బాసట నిర్వాహకులు డీపీ కార్తిక్‌రెడ్డికి అందజేశారు.

సత్కారం



మూల మల్లికార్జునరెడ్డిని సత్కరిస్తున్న సాహిత్యాభిమానులు

కడప కల్చరల్ : వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డిని సోమవారం బ్రౌన్ గ్రంథాలయంలో సత్కరించారు. సంస్థ ఉపాధ్యక్షులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు మాట్లాడుతూ మూల మల్లికార్జునరెడ్డికి ఇటీవల ప్రభుత్వం కందుకూరి విశిష్ఠ పురస్కారాన్ని అందజేసిందన్నారు. ఉగాది పురస్కారాలు, కందుకూరి పురస్కారాలు అందుకున్న వారిలో జిల్లా రచయితల సంఘం సభ్యులు ఐదుగురు ఉండడం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో అధికార భాషా సంఘం పూర్వ సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య, డాక్టర్ జీవీ సాయిప్రసాద్, డాక్టర్ భూతపురి గోపాల కృష్ణశర్మ, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణి, వెల్లాల వెంకటేశ్వరాచారి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ఈ ఆందోళనలో యూనియన్ నాయకులు కె. శ్రీరాములు, ఇ. ప్రకాష్ మాట్లాడుతూ అరవై ఏళ్లు నిండిన కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. కార్మికులు ఈ పనిని నమ్ముకుని ఈ ప్రభుత్వం మేలు చేస్తుంది, ఆ ప్రభుత్వం మేలు చేస్తుందని 30ఏళ్లుగా ఎదురు చూస్తూ సేవ చేశారన్నారు. దీనికి ప్రతిఫలంగా కూటమి ప్రభుత్వం వారిని ఒట్టి చేతులతో గెంటివేయడం దారుణమన్నారు. 30 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులకు గుర్తింపుకార్డుకానీ, అనుభవ సర్టిఫికెట్ గానీ, రిటైర్‌మెంట్ బెనిఫిట్లు ఏమీ లేకుండా ఆప్కాస్‌ను తొలగించడం సరికాదన్నారు. కార్మికుల కడుపుకొట్టే ఈ కఠిన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని లేనిపక్షంలో ఆందోళనబాటలో ఎంతవరకైనా వెళ్లేందుకు సిద్ధమన్నారు. సమ్మెకైనా, ఆమరణదీక్షకైనా వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రవి, కె.తిరుపాలు, కిరణ్, ఆదం, కొండయ్య, ప్రభాకర్, ఆర్ శీను, నాగరాజు, మహిళా కార్మికులు పాల్గొన్నారు.



కార్పొరేషన్ కార్యాలయం ఎదుట మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

60 ఏళ్లు నిండిన ఆప్కాస్ కార్మికులను ఆదుకోవాలి

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థలో ఆప్కాస్‌లో పనిచేస్తున్న 60 ఏళ్లు నిండిన కార్మికులను ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జి. వేణుగోపాల్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షులు కేసీ. బాదుల్లా, నగర అధ్యక్షులు వీరమల్లి నర్సింహులు, కార్యదర్శి తారక రామారావులు కోరారు. సోమవారం కమిషనర్ మనోజ్‌రెడ్డికి వారు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులను రిటైర్మెంట్ చేయకుండా రెగ్యులర్ ఉద్యోగులు మాదిరే 62 సంవత్సరాల వరకు డైలీ వేజ్ కార్మికులుగా ఉపయోగించుకోవాలని, వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఆప్కాస్‌లో ఉద్యోగం కల్పించాలన్నారు. రెగ్యులర్ ఉద్యోగులకు పదవీ విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచిన ప్రభుత్వం..కాంట్రాక్టు, ఎన్ఎంఆర్, ఆప్కాస్‌లో పనిచేస్తున్న కార్మికులకు పెంచకపోవడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్ సీనియర్ నగర ఉపాధ్యక్షుడు కె. జాన్, మేళంగి రాజశేఖర్, కోశాధికారి వెంకటాద్రి, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

హమాలీలకు మొదటి వారంలోనే కూలీ చెల్లించాలి

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలోని పౌరసరఫరాల సంస్థలో పనిచేస్తున్న హమాలీలకు ప్రతినెల మొదటి వారంలోనే కూలీ డబ్బులు చెల్లించాలని, అలాగే అరియర్స్ ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి కోరారు. సోమవారం జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. గత సంవత్సరం జనవరి నుంచి పెరిగిన కూలీ రేట్లు 14 నెలలుగా ఇవ్వకుండా ఉన్నారని తెలిపారు. అరియర్స్ చెల్లిస్తామని పౌరసరఫరాలశాఖ జీఓ విడుదల చేసినా కాలయాపన చేయడం తగదన్నారు. హమాలీలను నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, సివిల్ సప్లయ్ హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాల గురవయ్య, మురారి, ఉపాధ్యక్షులు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



జేసీకి సమస్యలను వివరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

బుగ్గవంక అంతటా బ్యూటిఫికేషన్ చేపట్టాలి

కడప సెవెన్‌రోడ్స్ : బుగ్గవంక ఆక్రమణలు తొలగించి రక్షణ గోడ నిర్మాణం, జంగిల్ క్లియరెన్స్, బ్యూటిఫికేషన్ పనులు చేపట్టాలని సీపీఐ నగర కార్యదర్శి ఎస్.వెంకట శివ సోమవారం జేసీ అదితి సింగ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. వైఎస్సార్ హయాంలో చేపట్టిన బుగ్గవంక సుందరీకరణ పనులు నిధుల లేమితో నత్తనడకన సాగుతున్నాయన్నారు. బుగ్గవంక వరద బారి నుంచి పంట పొలాలు, ప్రజల ఆస్తులు రక్షించేందుకు, ట్రాఫిక్ సమస్య అధిగమించి కడప అభివృద్ధికి దోహదపడేలా నగర పరిధిలో ఉన్న బుగ్గవంక అంతటా రక్షణ గోడ, అప్రోచ్‌రోడ్డు, బ్యూటిఫికేషన్ నిర్వహించాలన్నారు. అల్మాస్‌పేట రోడ్డు వంతెన నుంచి పాలెంపల్లె బైపాస్ రింగ్‌రోడ్డు వరకు ఉన్న బుగ్గవంక కుంచించుకు పోయిందని తెలిపారు. కంపచెట్లు, జమ్ము, పిచ్చిమొక్కలతో అధ్వాన్నంగా ఉన్న ఈ వంకలో జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు టక్కోలు మనోహర్‌రెడ్డి, పగడపూల మల్లికార్జున, చంద్రశేఖర్ రెడ్డి, పక్కీరప్ప, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



జేసీకి వినతిపత్రం సమర్పిస్తున్న సీపీఐ నాయకులు

కబ్జా భూములు ఎస్సీలకు అప్పగించాలి

కడప సెవెన్‌రోడ్స్ : వీరపునాయునిపల్లె మండలం అనిమెల గ్రామంలో షెడ్యూల్డ్ కులాలకు చెందిన పేదలకు గతంలో ఇచ్చిన భూములను కొందరు అగ్రవర్ణాలు కబ్జా చేశారని, ప్రభుత్వం తక్షణమే వాటిని స్వాధీనం చేసుకుని లబ్ధిదారులకు అందించాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి కె.మునెయ్య డిమాండ్ చేశారు. పలుమార్లు రెవెన్యూ అధికారులను కలిసి విన్నవించినా ఫలితం లేకపోవడంతో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. మునెయ్య మాట్లాడుతూ 1976–77 సంవత్సరంలో దళితులకు డి.ఫారాలు ఇచ్చారని పేర్కొన్నారు. లబ్ధిదారుల వారసులు భూములను సాగు చేసుకుంటూ ఉండగా, వాటిని కొంతమంది అగ్రవర్ణాలవారు ఆక్రమించి దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. ఆన్‌లైన్‌లో కూడా దళితుల పేర్లే ఉన్నాయని, పాసు పుస్తకాలు, 1బీ అడంగల్ సైతం ఉన్నాయన్నారు. రెవెన్యూ మ్యాప్‌లో సర్వే నెంబర్లను మార్చేశారని ఆరోపించారు. అధికారులు సర్వే నిర్వహించకుండా దళితులకు అన్యాయం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా సర్వే నిర్వహించి దళితుల భూములు అప్పగించకుంటే నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న డీహెచ్‌పీఎస్ నాయకులు

నూతన పీఠాధిపతి పాల్ ప్రకాష్‌కు అభినందనలు

కడప కార్పొరేషన్: కడప డయాసిస్ నూతన పీఠాధిపతిగా ఎంపికైన సగినాల పాల్ ప్రకాష్‌ను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాలు మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం బిషప్ హౌస్‌లో వారు ఆయన్ను కలిసి శాలువా లు కప్పి, మొక్క ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పాక సురేష్, బాల స్వామి రెడ్డి, మహమ్మద్ షఫీ, సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ పులి సునీల్ కుమార్, నాయకులు రెడ్డయ్య, షఫీ ఉల్లా, ప్రదీప్, చిట్టి, తదితరులు ఉన్నారు.



నూతన పీఠాధిపతి పాల్ ప్రకాష్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

కడప కోటిరెడ్డి సర్కిల్ : అమృత్ భారత్ స్టేషన్స్ పథకంలో భాగంగా కడప రైల్వే స్టేషన్‌లో రూ.25కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనుల విషయంలో ప్రయాణీకులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులు లక్ష్మణరావు, పద్మావతిభాయ్, నాగిరెడ్డి, షిండే భాస్కరరావు, కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, రవి నాయుడులు కోరారు. సోమవారం సాయంత్రం కడప రైల్వే స్టేషన్‌లో రైల్వే స్టేషన్ మేనేజర్ శేఖర్ కుమార్, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్‌లతో కలిసి కడప రైల్వేస్టేషన్‌లో వీవీపీ లాంచ్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ మేనేజర్ శేఖర్ కుమార్ మాట్లాడుతూ ప్రయాణీకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకున్నామని సూచించారు. ఇచ్చిన సమయానికే పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కడప స్టేషన్ మేనేజర్ శేఖర్ కుమార్

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అగ్ని ప్రమాదంలో సిలిండర్ అంటుకుంటే ఎలా ఆర్పాలో చూపిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కడప ఎడ్యుకేషన్: అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా అగ్నిమాపక అధికారి బి. బసివిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం జాతీయ అగ్నిమాపక సేవా వారోత్సవాల్లో భాగంగా జిల్లా అగ్నిమాపక శాఖ, వై.వి.యు ఎన్ఎస్ఎస్ యూనిట్–4 ఆధ్వర్యంలో యోగివేమన విశ్వవిద్యాలయ విద్యార్థినిల వసతి గృహంలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బసివిరెడ్డి బృందం డెమో ద్వారా వివరిస్తూ ప్రమాదం ఎదురైనప్పుడు ఆందోళన చెందకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. గ్యాస్ నుంచి మంటలు వచ్చినప్పుడు ఎలా ఆర్పాలో ప్రదర్శన ద్వారా చూపించారు. గ్యాస్ సిలిండర్ల వినియోగంపై పలు సూచనలు చేశారు. అధిక మొత్తంలో సిలిండర్లు నిలువ ఉన్నప్పుడు ఆ యాజమాన్యం ఎలా అప్రమత్తంగా ఉండాలో తెలియ చేశారు. ప్రిన్సిపల్, చీఫ్ వార్డెన్ ఆచార్య ఎస్ రఘునాథ రెడ్డి, ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ ఎస్. సునీత పాల్గొన్నారు.

ప్రవేశాల డ్రైవ్‌లో ఉపాధ్యాయులు పాల్గొనాలి

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాల డ్రైవ్‌లో ఉపాధ్యాయులు చురుగ్గా పాల్గొనాలని క్లస్టర్ ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి సూచించారు. సోమవారం నగర పరిధిలోని నగర పాలక ఉర్దూ ప్రాథమిక పాఠశాల, ఆర్కే నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, మృత్యుంజయ కుంట పాఠశాలలను సందర్శించి ఆరవ తరగతి విద్యార్థులను అడ్మిషన్స్ చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 22, 23 తేదీలలో ప్రవేశాల డ్రైవ్ నిర్వహించాలని తెలిపారు. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు తమ పరిధిలోని అంగన్వాడీ పాఠశాలల వద్దకు వెళ్లి ఆరు సంవత్సరాల వయసు ఉన్న పిల్లలను తమ పాఠశాలలో చేర్చుకోవాలన్నారు. ఐదవ తరగతి అయిపోయిన విద్యార్థులను తల్లిదండ్రుల కోరిక మేరకు వారికి అనువైన ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులను చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్ ఎండి ఇలియాస్ బాష, వి. అనిల్ కుమార్, జుబేర్ అహ్మద్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర వ్యాప్తంగా పదోన్నతులు లేక డీఈవో పూల్‌లో మగ్గుతున్న ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు, హిందీ, ఉర్దూ భాషా పండితుల ఉన్నతీకరణ సమయంలో వందలాది ఉపాధ్యాయులు డీఈవో పూల్‌లో ఉండిపోయారన్నారు. వారంతా పని ఒక ప్రదేశంలో చేస్తూ వేతనాలు మరో ప్రదేశంలో తీసుకొనే పరిస్థితులు ఏర్పడ్డాయని చెప్పారు. ప్రస్తుతం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో తెలుగు, హిందీ, ఉర్దూ పాఠశాల సహాయకుల పోస్టులు భర్తీ చేస్తున్న సందర్భంగా తొలుత డీఈవో పూల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని కోరారు.

డీసీఓను సస్పెండ్ చేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : కొండాపురం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌కు వత్తాసు పలుకుతున్న డీసీఓను సస్పెండ్ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాహుల్, ఏఐఎస్‌బీ జిల్లా కన్వీనర్ రాజేంద్ర, పీఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగరాజు, ఏపీపీఏ కన్వీనర్ భాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించారు. కొండాపురం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, ఆమె భర్తపై అనేక ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. పైగా ఇద్దరిపై కేసు నమోదు కూడా అయిందని పేర్కొన్నారు. ఆరోపణలు, కేసులు ఉన్న వ్యక్తిని ప్రిన్సిపాల్‌గా కొనసాగించడంలోని ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయకుంటే ఆందోళనలు చేపడతామన్నారు.

హౌస్ సైట్ వెరిఫికేషన్‌కు సహకరించండి

కడప కోటిరెడ్డి సర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు కడప నగరంలో హౌస్ సైట్ వెరిఫికేషన్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని కడప ఇన్‌ఛార్జి తహసీల్దార్ శివారెడ్డి తెలిపారు. కడప మండలంలోని 13 లే అవుట్లలో 19931మందికి ప్లాట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా సోమవారం తహసీల్దార్‌తోపాటు గ్రామ రెవెన్యూ అధికారులు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో కలిసి ఎస్‌టీపీ లే అవుట్ టిక్కో –1, టిక్కో–2 లలో హౌస్ సైట్ వెరిఫికేషన్ చేశామన్నారు. మిగిలిన లే అవుట్లలో కూడా హౌస్ సైట్లను వెరిఫికేషన్‌ను పూర్తి చేసి అర్హుల జాబితాను, ఖాళీ ప్లాట్ల వివరాలను, ప్రభుత్వం నిర్దేశించిన నిర్దిష్ట నమూనాలను కలెక్టర్‌కు తదుపరి చర్యల నిమిత్తం సమర్పించనున్నామన్నారు.

జాబ్ ఫెస్ట్‌కు స్పందన



ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థికి నియామక పత్రం అందచేస్తున్న కంపెనీ ప్రతినిధి

కడప ఎడ్యుకేషన్: కడప ప్రభుత్వ పురుషుల కళాశాలలో సోమవారం నిర్వహించిన జాబ్‌ఫెస్ట్‌కు స్పందన లభించింది. కడప ప్రభుత్వ పురుషుల కళాశాల, కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలు సంయుక్త ఆధ్వర్యంలో ఏపీ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, డిస్ట్రిక్ ఎంప్లాయిమెంట్ ఎక్చేంజ్ సౌజన్యంతో జవహర్ నాలెడ్జ్ సెంటర్ (జేకేసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాబ్‌ఫెస్ట్‌లో 234 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.జి.రవీంద్రనాథ్ తెలిపారు. కడప ప్రభుత్వ పురుషుల కళాశాలతోపాటు వివిధ ప్రభుత్వ, ప్రైవేటు ఎయిడెడ్ కళాశాలలకు చెందిన 338 మంది విద్యార్థులు హాజరై రాత పరీక్ష, మౌఖిక పరీక్షకు హాజరవగా ఇందులో 243 మంది 21 కంపెనీలకు ఎంపిక చేసుకున్నారని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి రవీంద్రనాథ్‌తోపాటు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి సలీం బాష, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎర్రగుంట్ల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం రవి కుమార్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం రమేష్, డిస్ట్రిక్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్చేంజ్ ఆఫీసర్ సురేష్ కుమార్, ఏపీ ఎస్ఎస్ డిసి జిల్లా అధికారి విజయ వినీల్ కుమార్, జెకెసి కోఆర్డినేటర్ రాము, సుజాత, అకాడమీ కోఆర్డినేటర్స్ పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్ దృష్టికి వక్ఫ్ ఆస్తుల అక్రమాలు

కడప కల్చరల్ : ఎకరాల కొద్ది వక్ఫ్ ఆస్తులను ఆక్రమణదారులు కబ్జా చేస్తున్న విషయాన్ని మైనారిటీ రైట్స్ పోరం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ దస్తగిరి జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ వసీం అక్రమ్ దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం ఈ మేరకు ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. కడప నగరం గూడూరు గ్రామ పొలంలో సర్వే నెంబరు 305లో మద్దెఖాన్ మస్జీద్ పేరుపై ఆర్ఎస్ఆర్ ప్రకారం.3.24 ఎకరాలు భూమి ఉందని ఆయన తెలిపారు. ఈ భూమిలో రూములు వేసి బంకులు ఏర్పాటు చేసి కబ్జా చేస్తున్న ఆక్రమణదారులను అడ్డుకునే వారే లేకపోవడం బాధాకరమన్నారు. వక్ఫ్ ఆస్తులను కాపాడాలని కోరారు.

ఆచార్యుల కాలనీలో బోగస్ పట్టాలు రద్దు చేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరం ఆచార్యుల కాలనీలో బోగస్ పట్టాలు రద్దు చేయాలని, వాటిని సృష్టిస్తున్న దళారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీఎం నాయకులు సోమవారం జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఆ పార్టీ నగర కార్యదర్శి ఎ.రామ్మోహన్ మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకున్న వారికి క్రిస్టియన్ మైనార్టీలు, బడుగు బలహీన వర్గాల పేదలకు సుమారు 30 ఏళ్ల క్రితం ఆచార్యుల కాలనీలో ఇళ్ల పట్టాలు ఇచ్చారని తెలిపారు. అక్కడ రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు వంటి సమస్యలను అధికారులు పట్టించుకోకపోవడంతో పలువురు లబ్ధిదారులు అక్కడ నివాసాలను ఏర్పాటు చేసుకోలేని పరిస్థితులు ఉత్పన్నమయ్యాయన్నారు. ఇది దళారులకు అయాచిత వరంగా మారిందన్నారు. పేదలకు ఇచ్చిన ఇంటి పట్టాలు దళారుల చేతుల్లో ఉన్నాయని తెలిపారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఓ తహసీల్దార్ సంతకాలు, సీళ్లతో దొంగ పట్టాలు సృష్టించి అమ్ముకుంటున్నారని తెలిపారు. ఇందులో రెవెన్యూ అధికారుల పాత్ర కూడా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బి.దస్తగిరిరెడ్డి, చంద్రారెడ్డి, గోవిందు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల చైర్మన్ బి. శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ నాగరాజు

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని శ్రీనివాస ఇంజనీరింగ్ అటానమస్ కళాశాలలో సోమవారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో విద్యార్థులు తమ సత్తాను చాటారు. కళాశాల చైర్మెన్ బి. శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ష్నైడల్ ఎలక్ట్రికల్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ లో ఎలక్ట్రానిక్స్ విభాగానికి చెందిన 21 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మెన్ బి. శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ నాగరాజు అభినందించారు.

సీనియారిటీ జాబితాలో చోటు కల్పించాలి



డీఈఓ షంషుద్దీన్‌కు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న వెంకట జనార్ధన రెడ్డి తదితరులు

కడప ఎడ్యుకేషన్: కడప కార్పొరేషన్, ప్రొద్దుటూరు మున్సిపాలిటీలలో గత ఏడాది జరిగిన రివైజ్ పదోన్నతులు పొందిన వారికి సీనియారిటీ జాబితాలో చోటు కల్పించడంతోపాటు ఆటోమేటిక్ అడ్వాన్స్‌డ్ స్కీమ్‌ను వర్తింపు చేయాలని ఏపీ సీపీఎస్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్సార్ వెంకట జనార్ధన్‌రెడ్డి కోరారు. ఈ విషయమై సోమవారం ఏపీ సీపీఎస్ ఈఏ ఆధ్వర్యంలో డీఈఓ షేక్ షంషుద్దీన్‌ను కడపలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇతర జిల్లాలలో జరిగిన పదోన్నతుల విధానానికి భిన్నంగా ఇక్కడ జరగడం వలన అనేకమైన చిక్కులు వచ్చినట్లు తెలిపారు. వీటిని వెంటనే సవరించి ఆయా ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోగుల వెంకటరామిరెడ్డి, పిఎస్‌టియూ రాష్ట్ర అధ్యక్షులు లెక్కల జమాల్‌రెడ్డి, ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండారెడ్డి, సిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాదర్‌బాష, పిఎస్‌టియూ జిల్లా అధ్యక్షులు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన తర్వాత సిబ్బందితో ఈఈ హరిసేవ్యానాయక్

కడప కార్పొరేషన్: రిమ్స్ సమీపంలోని 33/11కేవీ విద్యుత్ ఉప కేంద్రంలో ప్రస్తుతం ఉన్న 5ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌కు అదనంగా మరో 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు కడప డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరిసేవ్యా నాయక్ తెలిపారు. సోమవారం నూతన పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌కు పూజలు చేసి ప్రారంభించారు. రిమ్స్ ఆసుపత్రిలో వేసవి కాలంలో చికిత్స కోసం వచ్చే రోగులకు, ఐసీయూలో ఉన్న రోగులకు ఇబ్బంది కాకుండా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా ఈ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌టీ రమణారెడ్డి, డీఈఈ రూరల్–1 రామచంద్రారెడ్డి, డీఈఈ టీఆర్ఈ, ఎస్‌పీఎం సుబ్బారావు, రిమ్స్ ఏఈలు రమణ, వీరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.